క్లుప్తంగా

బోరుకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న చైర్మన్, కౌన్సిలర్

ఖానాపూర్: పట్టణంలోని ఎనిమిదో వార్డు పరిధిలో ఉన్న విద్యానగర్‌లో నిరుపయోగంగా ఉన్న బోరుకు చైర్మన్ చిన్నం సత్యం, కౌన్సిలర్ అబ్దుల్ ఖలీల్ ఆధ్వర్యంలో ఆదివారం మరమ్మతులు చేపట్టారు. స్థానికుల విన్నపం మేరకు మరమ్మతులు చేయించి.. తాగునీటి సరఫరాను ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీవాసులు షౌకత్‌పాషా, షారూక్‌ఖాన్ తదితరులున్నారు.

యువతి అదృశ్యం



శైలజ

లక్ష్మణచాందా: మండల కేంద్రానికి చెందిన దా సరి శైలజ (19) శనివారం ఉదయం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు ఖానాపూర్ వెళ్తానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు త మ బంధువుల ఇళ్లకు ఫోన్ చేశారు. ఆదివారం వరకు ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి గంగయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమలత తెలిపారు.

కుస్లి గ్రామంలో..



చిన్న భూమన్న

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లి గ్రామంలో చాకలి చిన్న భూమన్న (50) అనే వ్యక్తి అదృశ్యం కాగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన భూమన్న.. తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టు పక్కల వెతికినా కనబడక పోవడంతో ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య చాకలి భారతి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

మండలస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

కుంటాల: మండలకేంద్రంలో నిర్వహించిన సీఎంకప్ పోటీల్లో సత్తా చాటినవారిని మండలస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. ఆదివారం కుంటాలలో నిర్వహించిన సీఎం కప్ పోటీల సందర్భంగా మండలస్థాయి పోటీలకు ఎంపికైన వారిని అభినందించారు. కార్యక్రమంలోఎంపీవో రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, పీఈటీలు ముఖీమ్, మమత తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న కళాకారులు

బాసర(ముధోల్): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఆదివారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన నాట్య కళాకారులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. భారతీయ సంస్కృతి లో వీణను దేవతల వాయిద్యంగా నిర్వాహకులు అభివర్ణించారు. కళలు, విద్యలకు అధిదేవతగా కొలిచే సరస్వతితో పాటు అనేక దేవతలకు వీణ ఇష్టమైనదని ఆలయ కార్య నిర్వాణాధికారి విజయరామారావు తెలిపారు. గుప్తుల కాలం నాటి అనేక గ్రంథాలలో సంగీతంతో పాటు కాళిదాసు అనేక రకాల వీణలను ప్రస్తావించారని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి

నిర్మల్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు నాగేందర్, అవినాష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని.. విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 600 ప్రభుత్వ పాఠశాలలను మూసి వేసే దిశగా అడుగులు వేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వసతులు కల్పించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో విద్యార్థి నాయకులు ఆదుమల్ల విశాల్, హరీశ్, రిజ్వాన్‌ఖాన్, మారుగొండ రోహిత్, పూదరి బిట్టు తదితరులు ఉన్నారు.

నర్సరీల్లో మొక్కల పెంపకం

- కవర్లలో మట్టి నింపుతున్న 'ఉపాధి' కూలీలు
- పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు



ఎల్వి గ్రామంలో కవర్లలో మట్టి నింపుతున్న కూలీలు

తానూరు: తెలంగాణను హరిత రాష్ట్రంగా మార్చడానికి వనమహోత్సవంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను తానూరు మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు చేపడుతున్నారు. అందులో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీలు ఇప్పటికే కవర్లలో మట్టి నింపే ప్రక్రియ ప్రారంభించారు. వచ్చే వానాకాలం నాటికీ మొక్కలను సిద్ధం చేసి పంపిణీ చేసే ఉద్దేశంతో పెంపకం పనులు చేస్తున్నారు.

ఒక్కో పంచాయతీలో 13వేల మొక్కలు..

తానూరు మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో రూ.4.03 లక్షల మొక్కల పెంపకం చేపట్టారు. ఒక్కో పంచాయతీలో 13 వేల చొప్పున మొక్కలు పెంచుతున్నారు. పంచాయతీల ఆధ్వర్యంలోనే నర్సరీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, ఉసిరితో పాటు గులాబీ, మందార, గన్నేరు, కాగితపు పూల మొక్కలు, టేకు, జామ, మారేడు మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో నర్సరీ పనులను జిల్లాస్థాయి అధికారులతో పాటు, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంపీవో నసీరుద్దీన్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్ పరిశీలిస్తున్నారు.

వేగంగా పనులు..

నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు మమ్మరంగా సాగుతున్నాయి. ప్రతి గ్రామంలో కూలీలకు ఉపాధి దొరుకుతుంది. ప్రస్తుతం నర్సరీల్లో బెడ్ పనులు, కవర్లలో మట్టి నింపే పనులు కొనసాగుతుండగా.. విత్తనాలు కూడా సిద్ధం చేస్తున్నట్లు ఈజీఎస్ అధికారులు తెలిపారు.



భోసిలో నర్సరీ

లక్ష్మణచాంద మండలంలో లక్ష్యం 2.25 లక్షల మొక్కలు..

లక్ష్మణచాంద: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్మణచాంద మండలంలోని నర్సరీల్లో 2.25 లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఈజీఎస్ ఏపీవో ప్రమీల తెలిపారు.

గ్రామాలవారీగా లక్ష్యం..

మండలంలో 18 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గ్రామాలవారీగా లక్ష్యం నిర్దేశించి మొక్కల పెంపకం పనులు చేపడుతున్నారు. లక్ష్మణచాంద మండలంలోని ధర్మారం, మునిపెల్లి, తిర్పెల్లి, నర్సాపూర్, కంజర్, వడ్యాల్‌తండా గ్రామాల్లో 10వేల మొక్కల చొప్పున, చామన్‌పెల్లి, పొట్టపెల్లి గ్రామాల్లో 12వేల మొక్కల చొప్పున, రాచాపూర్, పీచర, మల్లాపూర్, కనకాపూర్, చింతల్‌చాంద, బోరిగాం గ్రామాల్లో 13వేల మొక్కల చొప్పున, బాబాపూర్‌లో 14వేల మొక్కలు, పార్పెల్లి, వడ్యాల్ గ్రామాల్లో 16వేల మొక్కల చొప్పున లక్ష్మణచాందలో 17 వేల మొక్కలు పెంచాలని నిర్ణయించినట్లు అధికారులు పేర్కొన్నారు.



లక్ష్మణచాంద: పొట్టపెల్లిలో మట్టి నింపుతూ..

ఔషధ మొక్కలకు ప్రాధాన్యం..

మండలంలోని గ్రామాల్లో ఈజీఎస్ సిబ్బంది గ్రామ సభలు నిర్వహించి నర్సరీల్లో పెంచే మొక్కల వివరాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. అందులో భాగంగా ఈసారి మండలంలోని నర్సరీల్లో ఔషధ మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. అలోవేర, అశ్వగంధ, ఇన్సులిన్, పు దీనా, డ్రాగన్ ఫ్రూట్ వంటి మొక్కలతో పాటు ఇతర ఔషధ, పూల మొక్కలు పెంచేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవో రాధ తెలిపారు.

ఉపాధి దొరుకుతుంది



ఉపాధిహామీ పథకం కింద నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టడం ద్వారా కూలీలకు పని దొరుకుతుంది. ప్రస్తుతం ఎర్రమట్టిని జల్లెడ పట్టి కవర్లలో నింపడం, మొలకలకు నీటిని అందించడం వంటి పనులు చేస్తున్నాం. – లక్ష్మణ్, ఎల్వి, మం.తానూరు

పనులు పర్యవేక్షిస్తున్నాం

గ్రామాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పనులు కొనసాగుతున్నాయి. నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ.. సిబ్బందికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

– గంగాధర్, ఈజీఎస్ ఏపీవో, తానూరు

ప్రజల అభీష్టం మేరకు మొక్కల పెంపకం



నర్సరీల్లో ఏయే మొక్కలు నాటాలనే అంశంపై గ్రామసభలో అభిప్రాయాలు సేకరించారు. అందుకు తగ్గట్టుగానే ప్రజలు చెప్పిన మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయించారు. ఈసారి పూలు, పండ్లతోపాటు ఔషధ మొక్కలకు ప్రాధాన్యమిస్తున్నారు.

– సుమన్, ధర్మారం, మం.లక్ష్మణచాంద

10న దివ్యాంగుల దినోత్సవం

భైంసాటౌన్: పట్టణంలోని స్నేహ సొసైటీ, లయన్స్‌క్లబ్ ఆఫ్ భైంసా డైమండ్, దివ్యాంగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ మహిపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని బృందావన్ గార్డెన్స్‌లో నిర్వహించే కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఏఎస్పీ అవినాష్‌కుమార్, పలువురు ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు.

కుభీర్‌లో క్రీడా పోటీలు..

కుభీర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 10నుంచి మూడు రోజుల పాటు సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నవనీత్‌కుమార్ తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటలు ఏర్పాటు చేశామని.. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మండలస్థాయి టెస్ట్

కడెం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బయోసైన్స్ ఫోరం మండల కోఆర్డినేటర్ వాల్గొట్ కిషన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని జిల్లా పరిషత్, గురుకుల, కేజీబీవీ, పాఠశాలల నుంచి పదోతరగతి విద్యార్థులు పరీక్షకు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: దత్త జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం మండలంలోని కల్లూరు సాయి బాబా ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. అందాకూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సగ్గం గంగాధర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.

మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



మకర తోరణంతో వస్తున్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో శ్రీమహాలక్ష్మి ఆలయ మూడో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పండితులు పిసుపాటి రేవంత్‌శర్మ, గాడిచర్ల గౌతమశాస్త్రి, కె.సంతోష్‌శర్మ, సిర్గ రాఘవేంద్రశర్మ, ఆదినారాయణశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, రక్షాబంధనధారణ, పంచగవ్య ప్రాసన, నవగ్రహ వాస్తుయోగిని క్షేత్రపాలక సర్వతో భద్రమండప ఆరాధనలు నిర్వహించారు. ఈసందర్భంగా మకర తోరణ సమర్పణ, అమ్మవారికి శతుష్టి ఉభచార సేవలు, ఫల, పంచామృత అభిషేకాలు, మండప దేవతా హోమాలు, ప్రత్యేకం శ్రీసుక్త సంపుటిత మూలమంత్ర హవనం, రుద్ర హవనం, దిగ్బలిప్రదానం, పూర్ణాహుతి, మహామంగళహారతి మంత్ర పుష్పం తదితర పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బక్కశెట్టి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, కారింగుల రాములు, ప్రకాశ్‌రెడ్డి, గుగ్గిల్ల రాజేందర్, ద్యావతి రాజేశ్వర్, సందీప్, శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రభాకర్, నిరంజన్, రాజన్న, గోపి, అజయ్, మనోజ్, సాగర్, తదితరులున్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



కల్లూర్‌లో అభిషేకం చేస్తున్న స్వాములు



నిర్మల్‌లో పూజలు చేస్తున్న స్వాములు

కుంటాల: మండలంలోని కల్లూరు వాసవి క ళాశాలలో ఆదివారం వైభవంగా అయ్యప్ప ప డిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా గణ పతి, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప చిత్రపటాల ను అలంకరించారు. ఆత్రేయ గురూజీ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ పూజ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు నర్సారెడ్డి, శెనిగారపు చిన్నయ్య, జక్కని గజేందర్, కదార్ల హరిప్రసాద్, గట్టుపల్లి శ్రీనివాస్, నటరాజ్, రాజేందర్ రెడ్డి, రజినీకాంత్, జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, శ్రీనివాస్‌గౌడ్, జానకీరాం, ప్రిన్సిపాల్ సాయిలు, భక్తులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని చింతకుంట వాడ కాలభైరవ స్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప దీక్షాపరులు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా స్వామివారికి అభిషేకాలు, హారతులు ఇచ్చారు. అనంతరం కౌన్సిలర్ గుంజల లక్ష్మి-శంకర్ దంపతులు ఆలయానికి రూ.51 వేల విరాళం అందజేశారు. ఇందులో అయ్యప్ప స్వాములు, తదితరులు ఉన్నారు.

పల్లకిసేవ శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామంలో విఠలేశ్వరుడి ఆలయంలో అఖండ హరినామ సప్తాహం వారంరోజులుగా కొనసాగుతోంది. ఆదివారం జ్ఞానేశ్వరి పారాయ ణం ముగియడంతో వార్కరి భక్తులు భజనలు చేస్తూ వీధుల గుండా విఠలరుక్మాబాయి పల్లకి సేవ శోభాయాత్ర నిర్వహించారు. గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. సోమవారం ఉదయం కాల్యకీర్తనతో ముగుస్తుందని పేర్కొన్నారు. గ్రామంలో జాతర సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

బాలికకు సమత ఫౌండేషన్ అండ

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ పంచాయతీలోని చర్లపల్లి గ్రామంలో ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన రితిక (7) అనే బాలికకు సమత ఫౌండేషన్ అండగా నిలిచింది. గ్రామస్తులు ఈ విషయాన్ని ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన చైర్మన్ సుదర్శన్ బాలికకు ఏయే కష్టంరాకుండా అన్ని విధాలుగా ఆదుకుంటామని గ్రామస్తుల సమక్షంలో హామీ ఇచ్చారు. తల్లిదండ్రులను కోల్పోయినవారికి, దివ్యాంగులకు, ఉన్నత చదువులకు దూరమైన ప్రతిభ కల్గిన విద్యార్థులకు ఫౌండేషన్ తరఫున సాయం అందిస్తామని చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు సాహెబ్ రావు, సీఈఓ అనిల్, పీఆర్ఓ క్రాంతి, యోగేశ్, ప్రవీణ్, రాజు, వెంకటేశ్‌గౌడ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

నూతన ఉద్యోగులకు సన్మానం

కుంటాల: కుంటాల చెందిన అల్లకొండ హిమబిందు, గాజుల ప్రవీణ్, సబ్బిడి హరిత, దోనిగామ సంధ్య ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా.. జక్కుల గజేందర్ హైకోర్టు న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం వీరిని కుంటాలలోని మున్నూరు కాపు సంఘ భవనంలో సంఘ సభ్యులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తోట రాఘవేందర్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, జుట్టు లక్ష్మణ్, సక్రపు గజేందర్, మానాజీగారి పోశెట్టి, కొత్త కాపు నారాయణ, మాదామ నాగరాజు, శ్రీపతి వివేకానంద్, సోమ రాములు, తాటి మహేశ్, దాసరి రమేశ్, తాటి శివ, సబ్బిడి గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పొగమంచు కమ్మేసింది..



భైంసాటౌన్: పట్టణంలో రెండురోజులుగా ఉదయం దట్టమైన పొగమంచు అలుముకుంటోంది. ఎనిమిది గంటలు దాటుతున్నా భానుడు బయటకు రావడం లేదు. చలిప్రభావం తగ్గినా.. రోడ్లపై పొగమంచు కారణంగా వాహనాలు దగ్గరకు వచ్చేసరికి కన్పించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. మరికొందరు పొగమంచు దృశ్యాలను ఆస్వాదిస్తున్నారు.



బైక్‌ను ఢీకొట్టిన అడవిపంది

- ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడ్డ నరేశ్



మృతిచెందిన అడవి పంది

లక్ష్మణచాంద: అడవిపంది ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. లక్ష్మణచాంద మండలం చామన్‌పెల్లి గ్రామానికి చెందిన సందుకుల నరేశ్(30) బైక్‌పై నిర్మల్ వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. పొట్టపెల్లి(కే) గ్రామ రైస్‌మిల్లు సమీపంలో ఒక్కసారిగా రోడ్డుపైకి అడవిపంది వచ్చి నరేశ్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆయన కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన పొట్టపెల్లి, రాచాపూర్ యువకులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి క్షతగాత్రుడ్ని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అడవిపంది సైతం అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు సైతం వచ్చి అతడి వివరాలు సేకరించారు. ఈఎంటీ సురేశ్, డ్రైవర్ అజార్ తదితరులు ఉన్నారు.

'షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోండి'

లోకేశ్వరం: వెల్మ కులస్తులను దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని వెల్మసంఘం సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే శంకర్‌పై ఏఎస్సై దిగంబర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో చిన్నారావు, వెంకట్‌రావు, రత్నార్‌రావు, శ్రీనివాస్‌రావు, ప్రకాశ్‌రావు, రవీందర్‌రావు, జయసాగర్‌రావు, శ్రీనివాస్‌రావు, నర్సింగ్‌రావు, కాంతారావు, నాగరావు, పనీల్‌రావు తదితరులున్నారు.

మందిరం నిర్మాణానికి భూమిపూజ

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో శ్రీరామమందిరం నిర్మాణానికి ఆదివారం గ్రామస్తులు, వీడీసీ సభ్యులు, నిర్మాణ కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. అంతకుముందు వేదపండితులు సంతోష్‌జోషి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. దేవాదాయశాఖ నుంచి మంజూరైన రూ.50 లక్షల నిధులతో పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో పలువురు వీడీసీ సభ్యులు, శ్రీరామ మందిర నిర్మాణం కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆదివాసీలకు 'కావేరి' చేయూత



కొలాంగూడలో ఆదివాసీలతో డాక్టర్ చక్రధర్

కడెం: మండలంలోని ఆదివాసీలకు అప్పాల కావేరి ఫౌండేషన్ చేయూతనిచ్చింది. ఆదివారం పెద్దూర్ పంచాయతీ పరిధిలోని గొండుగూడెం, కొలాంగూడెంల్లో ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. వైద్యపరీక్షల అనంతరం 200మందికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ అప్పాల చక్రధర్ కూతురు కావేరి జయంతి సందర్భంగా ఆయా గ్రామాల్లోని 69 మందికి దుప్పట్లు, స్వెట్టర్లు అందజేశారు. అవసరమైన వారికి ఐరన్, మల్టీవిటమిన్ల మాత్రలు, టానిక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పాల కావేరి ఫౌండేషన్ అధ్యక్షులు, చిన్నపిల్లల వైద్యులు అప్పాల చక్రధర్ మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో రక్తహీనత, పౌష్టికాహారం లోపం వంటి సమస్యలున్నాయని.. వాటిని అధిగవించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ కోశాధికారి శ్రీమతి అప్పాల శశికళ, సభ్యులు తుమ్మల దేవరావు, అంబటి నారాయణ, మైస అరవింద్, రమణారెడ్డి, గోండు గూడెం పటేల్ కొడ్రం జగదీశ్‌రావు, కార్యదర్శి భూమేశ్, కొలాంగూడ పటేల్ ఆత్రం శ్రీనివాస్, తెరవే జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హన్మంతు, ఫౌండేషన్ కోఆర్డినేటర్ పోలీసు భీమేశ్, కావేరి లైబ్రరీ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి, డా.శ్రీనివాస్, వైద్య సిబ్బంది రవి, రాజేశ్ తదితరులున్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై హన్మాండ్లు

నర్సాపూర్(జి): మండలంలోని తిమ్మాపూర్(జి) గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. తనిఖీల్లో ఏఎస్సై శంకర్, కానిస్టేబుల్ చౌహాన్ కృష్ణ ఉన్నారు.

కుంటాల: మద్యం సేవించి వాహనాలు నడిపితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై భాస్కరాచారి హెచ్చరించారు. ఆదివారం రాత్రి కుంటాల–అంబకంటి మార్గంలో వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రైతుపండుగ



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని బాబాపూర్‌లో రైతుపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఏఎంసీ వైస్‌చైర్మన్ ఈటెల శ్రీనివాస్ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ తునికి రాజేశ్వర్, మాజీ సర్పంచులు తునికి నారాయణ, రాజన్న, అంజయ్య, సుంకరి సురేశ్, ముద్ర బోయిన వినేశ్, సుంకరి గంగయ్య, రైతులు పాల్గొన్నారు.